క్లుప్తంగా

సునీల్‌కుమార్ నామినేషన్ రేపు



పూతలపట్టు: వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ శుక్రవారం ఉదయం 11 గంటలకు పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ సమర్పించనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. కావున నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల మధ్య నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

వరసిద్ధుని సేవలో కలెక్టర్



తిరుపతి కలెక్టర్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని బుధవారం తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందజేసి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో అధికారులు విద్యాసాగర్‌రెడ్డి, కోదండపాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సెలెస్టా 2కే24

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని ఆర్‌వీఎస్ నగర్‌లో ఉన్న ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నుంచి మూడు రోజుల పాటు సెలెస్టా 2కే24 వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల వైస్ చైర్మన్ రావూరి శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా తమ కళాశాలలో ఘనంగా సెలెస్టా వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ అని అన్నారు. ఈ ఏడాదికి గాను ఈ నెల 18, 19, 20 తేదీల్లో అట్టహాసంగా 2కే 24 సెలెస్టా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు.

సరిహద్దుల్లో తనిఖీలు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఏఆర్వో, ఎంసీసీ నోడల్ అధికారి, కమిషనర్ అరుణ తనిఖీలు చేపట్టారు. గుడిపాల మండలం ముత్తురాసికుప్పం వద్దనున్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్టీ, ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ బృందాలతో పాటు తనిఖీలు చేపట్టారు. సరిహద్దుల్లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీ వివరాలను రికార్డులో పొందుపరచాలన్నారు. వాహనాల వివరాలు, సంబంధిత వ్యక్తుల వివరాలు, సరుకు వివరాలు నమోదు చేయాలన్నారు. రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు తీసుకెళుతుంటే కచ్చితంగా ఆధారాలు చూపాలన్నారు. తనిఖీల్లో భాగంగా సీజ్ చేసిన నగదు, వస్తువుల వివరాలను రికార్డుల్లో నమోదు చేసి పోలీసులకు అప్పగించాలన్నారు. తనిఖీ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయాలని బృందాలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ వీఎస్టీ బందాల అధికారులు గోపి, గోపాలకృష్ణ వర్మ, ఆరీఫుల్లా, పోలీసులు పాల్గొన్నారు.







ముస్లింలకు రంజాన్ తోఫా ఇస్తున్న విజయానందరెడ్డి, చిత్తూరులో జగనన్న క్యాంటీన్ ప్రారంభించిన విజయానందరెడ్డి, సీఎం వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా విజయానందరెడ్డి పంపిణీ చేసిన వస్త్రాలు తీసుకెళుతున్న మహిళలు (ఫైల్)

సమాజ సేవకుడిగా.. జగనన్న సైనికుడిగా..

- చిరు వ్యాపారులకు రూ.3.68 కోట్ల మార్కెట్ గేటు ఉచితం
- సొంత నిధులతో నియోజకవర్గంలో నీటిశుద్ధి ప్లాంట్లు
- ప్రధాన పండుగలకు నిత్యావసరాలు కానుకల పంపిణీ
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సేవాభావం
- నేడు ప్రజలు, కార్యకర్తల నడుమ నామినేషన్ దాఖలు

చిత్తూరు అర్బన్: ఎన్నికలు వస్తున్నాయంటే ఉన్నట్టుండి ఊడిపడ్డ నాయకుడుకాదు. చేతికి అరటిపండు ఇచ్చి పబ్లిసిటీకోసం వెంపర్లాడే వ్యక్తి అంతకన్నా కాదు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సైనికుడిగా.. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేస్తున్న పథకాలు చూసి తనవంతుగా చిత్తూరు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేస్తూ నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తే ఎంసీ.విజయానందరెడ్డి. తాను ఎమ్మెల్యే అభ్యర్థికాక మునుపు నుంచే సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందారు. చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గురువారం విజయానందరెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయన వెంట నడవడానికి పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజలు సైతం స్వచ్ఛందంగా అడుగులు వేయడానికి సిద్ధమవుతున్నారు. పారాచ్యూట్ నాయకుల్లా కాకుండా ప్రజల మధ్య ఉన్న విజయానందరెడ్డి చిత్తూరు తన సొంత నిధులతో పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచారు. తాను చేసిన సేవా కార్యక్రమాలే శ్రీరామరక్ష అని, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మంచే తనను గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఐదేళ్లలో విజయానందరెడ్డి చిత్తూరు నియోజకవర్గ ప్రజల కోసం చేపట్టిన సేవా కార్యక్రమాలు చూస్తే..

- చిత్తూరులో మార్కెట్‌గేటు అంటేనే హడల్. అధికారంలో ఉన్న వ్యక్తులు రౌడీయిజం చెలాయించి, రోడ్లపై కూరగాయలు, బొమ్మలు అమ్ముకునే వ్యాపారులను తన్ని మరీ గేటు వసూలు చేయడం ఐదేళ్ల క్రితం వరకు చిత్తూరులో కొనసాగిన దౌర్జన్యకాండ. ఆ రౌడీయిజాన్ని తట్టుకోలేక ఊరు వదిలిపారిపోయినవాళ్లు ఓవైపు.. ప్రాణాలు విడిచినవాళ్లూ లేకపోలేదు. మార్కెట్‌గేటు టెండర్లలో పాల్గొన్న విజయానందరెడ్డి గత ఐదేళ్లలో మునిసిపల్ కార్పొరేషన్‌కు రూ.3.68 కోట్లు చెల్లించారు. ఇక్కడ వ్యాపారాలు చేసుకునే ఏ ఒక్కరూ రూపాయి కూడా గేటు చెల్లించవద్దని చెప్పారు. మొత్తం తానే భరించి రైతులకు, వ్యాపారులకు గేటు ఉచితం చేశారు.
- చిత్తూరు నగరంలోని చవటపల్లె, ప్రభుత్వ ఆసుపత్రి, సావిత్రమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంగనపల్లె కూడలి, కైలాసపురం చిత్తూరు మండలంలోని తాళంబేడు, నాయినిచెరువు, గుడిపాల మండలంలోని శ్రీరంగంపల్లె, పానాటూరు, గుడిపాల ప్రాంతాల్లో ప్రజలకు నీటిశుద్ధి ప్లాంట్లను తన డబ్బుతో ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు ట్యాంకర్లతో ఉచితంగా నీటిని సరఫరా చేస్తున్నారు.



డ్రైవర్లకు పంపిణీ చేస్తున్న యూనిఫాం దుస్తులు (ఫైల్)

- గత నాలుగేళ్లల్లో ముస్లింలకు రంజాన్ పండుగవేళ తోఫా పేరిట నెలకు సరిపడే నిత్యావసర సరుకులు ఉచితంగా అందించారు. మసీదుల అభివృద్ధికి ఒక్కో మసీదుకు రూ.50 వేలు చొప్పున నగరంలోని 46 మసీదుల్లో కనీస వసతులు కల్పించారు. శిథిలావస్థలో ఉన్న షాదీఖానాకు రూ.10 లక్షలు వెచ్చించి ఆధునీకరించారు. క్రిస్మస్ పండుగ వేళ క్రైస్తవులకు నూతన వస్త్ర కానుకలు, దీపావళి, ఉగాది పండుగలకు నిత్యావసర వస్తువులు ఉచితంగా అందజేశారు.
- యువతను ప్రోత్సహించడానికి గత మూడేళ్లుగా మంత్రి పెద్దిరెడ్డి పేరిట పీఎల్ఆర్–వీఎస్ఆర్ క్రికెట్ టోర్నీలు నిర్వహిస్తూ నగదు బహుమతులు ఇస్తున్నారు. కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాలకు ఉచితంగా ఫ్యాన్లు, తుపాను సమయాల్లో బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేశారు.
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని చిరు వ్యాపారులకు రూ.60 లక్షల విలువైన 80 తోపుడుబండ్లను ఉచితంగా అందజేశారు. పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ధ్యాన మందిరం నిర్మాణం కోసం రూ.20 లక్షల విరాళం తన వంతుగా అందజేశారు.
- సీఎం పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గంలోని 45 వేల మంది మహిళలకు ఉచితంగా చీరలు ఇవ్వడంతో పాటు ఆశావర్కర్లు, రిసోర్సు పర్సన్లు, రేషన్‌డీలర్లు, వలంటీర్లకు ఉచితంగా వస్త్రాలతోపాటు కుట్టుకూలీ రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు.
- ఓ డ్రైవర్‌గా తన జీవితాన్ని ప్రారంభించిన నేపథ్యంలో నియోజకవర్గంలో 3,500 మంది ఆటో, మినీ వెహికల్స్, లారీ డ్రైవర్లకు నాలుగు జతల యూనిఫామ్‌తోపాటు వాటిని కుట్టుకోవడానికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున నగదును అందించారు.
- ఆకలితో అలమటించేవాళ్ల కోసం నాలుగు నెలల క్రితం జగనన్న క్యాంటీన్ ప్రారంభించి రోజుకు 600 మందికి ఉచిత పౌష్టికాహారం ఇప్పటికీ అందిస్తున్నారు.
- మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు ఉచితంగా రెండు మహా ప్రస్థానం వాహనాలు, ఫ్రీజర్లను ప్రజలకు అందుబాటులో ఉంచారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, తాను చేసిన సేవా కార్యక్రమాలే తనకు అండగా నిలుస్తాయని విజయానందరెడ్డి స్పష్టం చేశారు.

మోసగాడు చంద్రబాబుతో తస్మాత్ జాగ్రత్త





ఎన్నికల ప్రచారంలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, కరపత్రాన్ని అందజేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

చిత్తూరు రూరల్: మోసగాడైన చంద్రబాబు బూటకపు హామీలను నమ్మితే ముంచేస్తాడని, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సూచించారు. చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, మేలును వివరించారు. తలుపుతట్టి చేసిన సేవలను వివరించారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని, జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి తెచ్చుకోవాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు వెన్నుపోటు రాజకీయాల్లో దిట్టన్నారు. తన రాజకీయ స్వలాభం కోసం సొంత మామ(మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు)నే మోసం చేసిన వ్యక్తి అని విమర్శించారు. అలాంటి వ్యక్తి పేదల ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను అందించడంలో బాబు విఫలమయ్యారన్నారు. బాబు హయాంలో రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. తన స్వార్థ రాజకీయాల కోసం ఇతర పార్టీలతో జతకట్టడం ఆయన నైజమని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజలను, రాష్ట్రాభివృద్ధిని ఆయన ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక ఈ రాష్ట్రాభివృద్ధిని పట్టాలెక్కించారని చెప్పారు. పేదల బాగు కోసం ఆయన పదుల సంఖ్యలో పథకాలను గడపవద్దకే పంపించారని స్పష్టం చేశారు. సామాన్యుల ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచారని పేర్కొన్నారు. మళ్లీ జగనన్న వస్తే సంక్షేమ పథకాలను ఇంటికే పంపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబు నాయుడు, మండల కన్వీనర్ త్యాగరాజులు, సర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ ఎమిలిరోస్లిన్, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, సంపత్, వి.బాబు, జయరాం, గుణశేఖర్, నాగరాజు,వినాయకం, లాజర్, దామోదరం, లక్ష్మీపతి, దిలీప్, పాండి, స్టాండిలీ, రాబర్ట్, ప్రభాకర్, వేలుస్వామి, రాజీవ్‌గాంధీ, రాజా పాల్గొన్నారు.

మంచి జరిగి ఉంటే ఆశీర్వదించండి

పూతలపట్టు: ప్రతి ఇంటికీ మంచి జరిగి ఉంటే, ఫ్యాను గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి అంటూ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని వావిల్‌తోట, పాలకూరు పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. అనంతరం గ్రామాల్లోని మహిళలతో మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. టీడీపీకి ఓటు వేస్తే మరోసారి మోసపోయినట్టేనని, సచివాలయాలు, వలంటీరు వ్యవస్థను రద్దు చేసుకున్నట్టేనని వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, పాలకూరు జీవరత్నంరెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకురాలు లలితకుమారి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచే నామినేషన్ల పర్వం



ఆర్‌ఓ కార్యాలయంలో అమర్చిన సీసీ కెమెరా



నామినేషన్ ప్రక్రియకు సిద్ధమైన కార్యాలయం

చిత్తూరు రూరల్/పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన మొదటి అంకం నేటి నుంచే మొదలు కానుంది. ఎన్నికల కమిషన్ ముందుగా ప్రకటించిన షెడ్యూల్ మేరకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ ఆరంభం కానుంది. ఆ వెంటే నామినేషన్ల పర్వం ప్రారంభమై వారం పాటు కొనసాగనుంది. ఈ నెల 25తో స్వీకరణ గడువు ముగియనుండగా, ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఇప్పటికే ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఇటు ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నామినేషన్ల ప్రక్రియ ఇలా..

నామినేషన్ల స్వీకరణ ఈ నెల 18 నుంచి 25 వరకు జరగనుంది. పరిశీలన 26న, ఉపసంహరణ గడువు 29న, పోలింగ్ మే 13న, ఓట్ల లెక్కింపు, ఫలితాలు జూన్ 4 వెలువడనున్నాయి. పూతలపట్టులో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్ వేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నియోజకవర్గానికి ఆర్వోగా ఆర్డీఓ చిన్నయ్యను నియమించారు. ఎన్నికల నోటిఫికేషన్ గురువారం ప్రారంభం కానుండగా, అందుకు అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. కార్యాలయంలో సీసీ కెమెరాలను అమర్చారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపి నిఘా పెట్టేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. నియోజకవర్గంలో 2,19,966 మంది ఓటర్లుండగా, 260 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

లెక్కలు తప్పనిసరి

నామినేషన్లు వేసిన నాటి నుంచే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు పరిగణనలోకి వస్తాయి. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆ లెక్కలు కచ్చితంగా చూపాల్సి ఉంటుంది. అభ్యర్థుల ఖర్చులను అంచనా వేసేందుకు ఈసీ ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసింది. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ వీడియో వ్యూయింగ్, ఎంసీసీ బృందాలు ఇప్పటికే రంగంలోకి దిగి తమకు కేటాయించిన విధులు నిర్వర్తిస్తున్నాయి.

శ్రీ సీతారాముల కల్యాణ వైభోగమే..

- ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- ఆలయాల్లో విశేష పూజలు



కాణిపాకంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

చిత్తూరు రూరల్/బంగారుపాళెం/ఐరాల/తవణంపల్లె/గుడిపాల: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో కనులపండువలా సీతారాముల కల్యాణం నిర్వహించారు. శ్రీరామ నవమి పండుగను బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా భక్తులు స్వామివారి దర్శనార్థం క్యూకట్టారు. అనంతరం హోమాలు, అన్నదానంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలు శ్రీ రామ నామస్మరణతో మార్మోగాయి.

కాణిపాకం శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అభిషేకం, తిరుమంజన పూజలను విశేషంగా జరిపించారు. అనంతరం కల్యాణ వేదిక, సీతారాముల ఉత్సవ విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించారు. వేదమంత్రాలు పఠిస్తూ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని పూర్తిచేశారు.

చిత్తూరు రాములగుడి వీధిలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని గరుడ వాహనంపై నగరవీధుల్లో ఊరేగించారు. పొన్నియమ్మ గుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. గిరింపేటలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

బంగారుపాళ్యం మండలం మొగిలివెంకటగిరిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి ఊరేగించారు. బోడబండ్ల, కూర్మాయిపల్లె, తిమ్మోజుపల్లె, కచ్చటివారిపల్లె రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు.

ఐరాల మండలంలోని శ్రీ కోదండరాములస్వామి ఆలయంలో మూలవర్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ స్వామి వారి కల్యాణోత్సవం జరిపించారు.

తవణంపల్లె మండలం అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తుల నడుమ అర్చకులు సంప్రదాయ పద్ధతులతో కనుల పండువలా నిర్వహించారు. ఉదయం వీరాంజనేయస్వామికి భక్తితో అభిషేకం చేయించారు. మండలంలోని టి.పుత్తూరులోని కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. గాజులపల్లె కోదండరాముల గుడిలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చరణ పఠనంతో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఎంపీపీ గీతారెడ్డి, హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుడిపాల మండలం పల్లూరు, 197రామాపురం, బసవాపల్లె, బొమ్మసముద్రం, నంగమంగళం, చిత్తపార, చీలాపల్లె, కోలావూరు గ్రామాల్లో సీతారాముల దేవాలయాల్లో రాములోరి కల్యాణాన్ని వేద పండితుల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నదానం చేశారు.



చిత్తూరు: గరుడ వాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు



తవణంపల్లె: గాజులపల్లెలో సీతారాముల కల్యాణం



మొగిలి: విశేషాలంకారంలో సీతారాములు









అర్ధగిరిలో సీతారాముల కల్యాణోత్సవం, ఐరాల: విశేష అలంకరణలో సీతారాములు, గుడిపాల: పల్లూరులో సీతారాముల కల్యాణోత్సవం, చిత్తూరు: మిట్టూరులోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో భక్తులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు అసెంబ్లీ స్థానానికి సంబంధించి కార్పొరేషన్ పరిధిలో పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాప్‌ను ఏఆర్వో, మునిసిపల్ కమిషనర్ అరుణ బుధవారం పరిశీలించారు. పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల నుంచి సంబంధిత సెక్టోరల్ అధికారి, రూట్ ఆఫీసర్, ఎస్.హెచ్.ఓలతో కలిసి పరిశీలించి, సంబంధిత పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. బాలాజీ నగర్ ప్రాథమిక పాఠశాల, లిటిల్ ఫ్లవర్ పాఠశాల, బిఎస్ కణ్ణన్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో తొమ్మిది పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. రూట్ మ్యాప్ ప్రకారం పోలింగ్‌కు సంబంధించిన వాహనాలు తిరగటానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని రూట్లను సంబంధిత రూట్, సెక్టార్ అధికారులు పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పన, ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట ఇన్‌చార్జి ఏసీసీ రామకృష్ణుడు, మునిసిపల్ ఇంజినీరు గోమతి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం ఇతర అధికారులు ఉన్నారు.